తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రాష్ట్రంలో పేదరికం...అవినీతిని తగ్గించాలి : మాజీ మంత్రి చింతా



కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పేదరికం, అవినీతిని తగ్గించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి దేవతల రాజధాని అంటున్నారని అయితే అక్కడ తనకు ఏ దేవుడు కన్పించేదని పేర్కొన్నారు. గుంటూరు ప్రాంతానికి 50వేల కోట్లు అప్పులు తెచ్చి అభివృద్ధి అంటున్నార న్నారు. కేవలం అమరావతి ప్రాంతంలో మంత్రులు రెండువందలు, మూడు వందల ఎకరాల భూములు కొన్నారని వారి కోసమే అమరావతి రాజధాని నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. కృష్ణాతీరంలో నిర్మించే రాజధాని నగరం ఫెయిల్ అవుతుందన్నారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు జీరో కరప్షన్ అంటున్నారని కుప్పంలోనే అవినీతి ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతోందన్నారు. 90శాతం ఎమ్మెల్యేలు, మంత్రులు డబ్బులు దోచేస్తున్నారని రాష్ట్రం అవినీతిమయంగా మారిందని ఆయన విమర్శించారు. యోగాంధ్ర పేరిట రాష్ట్రంలో అంత డబ్బు ఖర్చు చేయడం అవసరమా అని ప్రశ్నించారు. కూటమి పాలనలో ప్రజాస్వామ్యం ధ్వంసమైందన్నారు. కుప్పంలోనే ఓ మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేశారన్నారు. కుప్పంలో వలసలు ఆగలేదని పేర్కొన్నారు. ద్రవిడ వర్సిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. మైనార్టీలు, ఒబిసిలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అరకు ప్రాంతంలో ఖనిజ సంపద కోసం గిరిజనుల పురుషాంగాలు కోస్తున్నారని ఆరోపించారు.

## 'దివ్య'దర్శనం టోకెన్లు జారీకి అనుమతులే తరువాయి!

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కాలినడకన శ్రీవారిమెట్టుమార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులసౌలభ్యం కోసం జారీచేస్తున్న దివ్యదర్శనం టోకెన్లు శ్రీనివాసమంగాపురంలో కౌంటర్లు ప్రారంభానికి మరింత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఈ ఆలయంప్రాంగణంలో విశాలమైన స్థలం కూడా ఉంది. ఇప్పటికే ఇక్కడ టోకెన్ జారీ కౌంటర్లు ఏర్పాటుచేసేందుకు టిటిడి ఈఓ శ్యామలరావు పురావస్తుశాఖకు లేఖరాశారు. ఈ లేఖ చేరినా అనుమతులు రావడానికి మరికొంత ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ఈ మార్గంలో రోజుకు 4వేలనుండి 5వేల దివ్యదర్శనం టోకెన్లు జారీచేస్తున్నారు. గతంలో శ్రీవారిమెట్టు మార్గంలోనే మొదట్లో టోకెన్లు అందుకున్న భక్తులు 1,200మెట్ల వద్ద స్కానింగ్ చేసుకుని, ముద్ర(స్టాంప్) వేసుకుని కొండకు చేరుకోవాల్సి ఉంది. అయితే గతంలో శ్రీవారిమెట్టుమార్గంలో భక్తులను ఆటోడ్రైవర్లు, ట్యాక్సీడ్రైవర్లు మాయమాటలతో నమ్మించి అధికఛార్జీలతోబాటు ఉచిత టోకెన్లుకు డబ్బులు వసూలు చేసేవారని ఫిర్యాదులు రావడంతో మెట్లమార్గంలో కౌంటర్లు మూసివేశారు. తాత్కాలికంగా ఈ టోకెన్లు జారీని అలిపిరి భూదేవికాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేశారు. అక్కడ నాలుగు కౌంటర్లలో రోజువారీగా మూడువేల నుండి ఐదువేల దివ్యదర్శనం టోకెన్లు జారీ అవుతున్నాయి. ఈ టోకెన్లు అందుకున్న భక్తులు శ్రీవారిమెట్టు వరకు ఉచితంగా ప్రయాణించేలా బస్సులు ఏర్పాటుచేశారు. అయినా చాలామంది భక్తులు శ్రీనివాస మంగాపురం నుండి అలిపిరి వరకు వచ్చి నిరీక్షించి టోకెన్లు అందుకునేందుకు అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసమంగాపురం ఆలయం వద్ద కౌంటర్లు ఏర్పాటుచేసి దివ్య దర్శనం టోకెన్లు జారీచేస్తే బావుంటుందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకు కర్నాటక రాష్ట్రం బెంగుళూరు,మైసూరు, తమిళనాడు వేలూరు, తిరువణ్ణామలై, కుప్పం,చిత్తూరు, అనంతపురం, మదనపల్లి వైపు నుండి వచ్చే యాత్రికులు శ్రీవారిమెట్టు మార్గంలోనే కాలినడకన తిరుమలకు వస్తుంటారు. ఇలా రోజువారీగా 10వేలమంది వరకు యాత్రికులు ఈ ప్రాంతాల నుండి చంద్రగిరి శ్రీనివాసమంగాపురం మీదుగా శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు చేరుకునేందుకు చూస్తుంటారు. ఇప్పుడు ఇంతమంది యాత్రికులు అలిపిరికి చేరుకుని టోకెన్లు అందుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ టోకెన్లుజారీ కౌంటర్లను త్వరగా శ్రీనివాసమంగాపురం ఆలయంలో ఏర్పాటుచేస్తే బావుంటుందని కోరుతున్నారు.ఈ పనులు టిటిడి ఇప్పటికే చేపట్టినా పురావస్తుశాఖ నుండి అనుమతులు కోసం విజ్ఞప్తి చేసింది. టోకెన్లు కౌంటర్లను వీలైనంత త్వరలోనే శ్రీనివాసమంగాపురంకి తరలించే అవకాశాలు ఉన్నాయి.

## మామిడి రైతులు ఆందోళన చెందవద్దు

- తోతాపురికి కేజీపై రూ.4 ప్రభుత్వం సబ్సిడీ
- ఫ్యాక్టరీలకు కాయలు తీసుకెళ్ళడానికి టోకెన్ పద్ధతి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త: జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని, రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం కార్వేటినగరం మండలంలోని అన్నూరు ఎబిసి మార్కెట్ కంపెనీ, చిత్తూరులోని శ్రీరామ్ ఫుడ్ కంపెనీ, పూతలపట్టు మండలంలోని గల్లా శ్రీ సన్నిధి మామిడి గుజ్జు పరిశ్రమ, జిడినెల్లూరు మండలంలోని జైన్ కంపెనీలను సందర్శించి ఆ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, ప్రతినిధులు, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్వేటినగరం అన్నూరు ఎబిసి కంపెనీలో రైతులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటోందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తల వల్ల జిల్లాలో మామిడి దిగుబడి పెరిగిందని, అలాగే అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, యుక్రేయన్ యుద్ధం వల్ల మామిడి పల్ప్ ఎగుమతి తగ్గిందన్నారు. ప్రక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకతో పాటు క్రిష్ణగిరి మార్కెట్, గుజ్జు పరిశ్రమల నుండి పార్లే, కోకోకోలా, పెప్సీ కంపెనీలు పల్ప్‌ను ఎక్కువగా కొనుగోలు చేయడంతో జిల్లాలో రెండు సీజన్లుగా తయారైన పల్ప్ నిల్వలు అలాగే వుండిపోయానన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు గుజ్జు పరిశ్రమలు, రైతులు, రైతు సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. సిఎం రైతులకు ఎక్కడ నష్టం జరుగకుండా మద్దతు ధర ప్రకటించారని, ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల నుండి మామిడి కొనుగోలు చేసిన ధరతో పాటు ప్రభుత్వం కేజీ మామిడికి రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.4 సబ్సిడీ చెల్లిస్తోందన్నారు. రైతుల నుండి చివరి మామిడి పండు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులు తొందరపడకుండా కాయలు కోయవద్దని, మామిడి పక్వానికి వచ్చిన అనంతరం కోయాలని పేర్కొన్నారు. అలాగే రైతులు మండీలు, ట్రేడర్స్, గుజ్జు పరిశ్రమల వద్దకు తొందరపడ వెళ్ళవద్దని, దిగుబడి రాకముందు కోతలు కోయవద్దన్నారు. రైతులకు ఎద్దైనా సందేహాలు వుంటే సమస్యలను పరిష్కరించడానికి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు 94910 77325, 98572-242777 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.



మామిడి రైతులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

### ఆందోళన వద్దు.. ఆదుకుంటాం

రైతులకు కలెక్టర్ సుమిత్ కుమార్ భరోసా

కల్లూరు, జూన్ 20 ప్రభాతవార్త: తోతాపురి సాగుచేసిన మామిడి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు లో పీలేరు మార్గంలో గల మామిడికాయల ర్యాంపును శుక్రవారం సాయంకాలం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రైతులు సహకరించాలని అన్నారు. అనంతరం రైతులు సందేహాలను కలెక్టర్ తెలుసుకున్నారు. రాంప్ వద్ద మామిడి కొనుగోలను ప్రతిరోజు పరిశీలించాలని నాలుగు గంటలకు ఒకసారి తనకు పరిస్థితిని తెలియజేయాలని తహశీల్దార్ జయసింహను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడి పరమేశ్వర్, ఎంపీడీవో రాజశేఖర్ బాబు ఉద్యాన శాఖ అధికారిణి. సంతోషికుమారి కార్యదర్శులు నాగరాజు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

## డైయింగ్ ఫ్యాక్టరీలపై కానరానీ పర్యవేక్షణ

బోరుబోవుల్లో రంగునీరు
సరఫరా-రోగాల బారిన ప్రజలు

నారాయణవనం, జూన్20 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో డైయింగ్ ఫ్యాక్టరీలను నడుపుతున్న వ్యక్తులు యద్ధేచ్ఛగా రంగునీళ్లను కాలువల ద్వారా విడుదల చేసి అరుణానదిలో కలిపేస్తున్నారు. ప్రధానంగా నారాయణవనంలో రెండు డైయింగ్ ఫ్యాక్టరీలు, 1,2 వార్డుల్లో మరో మూడు డైయింగ్ ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. డైయింగ్ ఫ్యాక్టరీలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మరమగ్గ యంత్రాల ద్వారా తయారు చేసు దుస్తులకు రంగునీళ్లను అదుతుంటారు. ఇలా వస్త్రాలకు రంగులు వేసిన తర్వాత ఆ నీటిని ధర్జాగా మురికికాలువల్లో వదిలేయడంతో దుర్వాసనతో పాటు చుట్టుపక్కల పబ్లిక్ బోర్లలోను రంగునీళ్లు కలుస్తున్నది. ఈ నీటిని త్రాగడం వల్ల ప్రజలు అనేక రకాల రోగాల భారిన పడుతున్నారు. ప్రధానంగా కీళ్లనొప్పులు, బాడీ పెయిన్ వంటి రోగాల భారిన చాలామంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. రంగునీళ్లను కాలువల్లో వదలడంతో చివరకు అరుణా నదిలో కలుస్తున్నది. అరుణానదిని ఆనుకొని సముదాయం, కీళగరం, వెత్తలతడుకు గ్రామాలకు చెందిన రైతుల భూముల్లో పంటసాగు చేసిన పంట పండడం లేదని వాపోతున్నారు. భూగర్భజలాల్లోకి చేరి అరుణానదిని ఆనుకొని వున్న గ్రామాల రైతుల భోర్లలో ఈ నీరు సరఫరా అవుతున్నది. వాస్తవానికి డైయింగ్ ఫ్యాక్టరీలను నడిపే వ్యక్తులకు తప్పకుండా అధికారుల నుంచి అనుమతి అవసరం. అయితే నారాయణవనం మేజర్ పంచాయతీలో సుమారు 5 డైయింగ్ ఫ్యాక్టరీలు నడుస్తున్నప్పటికి ఇందులో ఒకటి,రెండు డైయింగ్ ఫ్యాక్టరీకు తప్పక మిగిలిన వాటికి అనుమతి లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా పంటసాగు చేస్తే సక్రమంగా పండకపోవడంతో రైతులు సాగు చేయడం నిలిపిస్తేన్నారు. ప్రతిసారి పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులకు ఇచ్చే కమీషన్‌తో పట్టించు కోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా తిరుపతి జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సముదాయం వద్ద వరిపంట సక్రమంగా పండని దృశ్యం

**రంగునీళ్ల కలుషితం వల్ల రోగాలు వస్తున్నాయి : గిరిధర్‌యాదవ్, సముదాయం గ్రామస్తుడు**

రంగునీళ్లు చేతిబోర్లలో కలుషితం కావడం వల్ల త్రాగే ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్టు సముదాయం గ్రామానికి చెందిన గిరిధర్‌యాదవ్ తెలిపారు. అరుణానది సముదాయం గ్రామానికి సమీపంలో వుండడంతోనే బోర్లలో రంగునీళ్లు కలుషితమవుతున్నట్టు చెప్పారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

**పంటలు ఎండిపోతున్నది : వెంకటరెడ్డి, రైతు సముదాయం**

డైయింగ్‌ఫ్యాక్టరీల ద్వారా విడుదలయ్యే రంగునీళ్ల వల్ల సముదాయం వాటి పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నట్టు సముదాయం గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి తెలిపాడు. రంగునీళ్లు అరుణానదిలో కలవడం వల్ల ప్రస్తుతం బోరుబావులు వున్నప్పటికి పంటసాగు చేయడం లేదని తెలిపారు. ఒకవేల పంటసాగు చేస్తే తప్పక ఎండిపోతుందన్న భయంతో రైతులు పంటసాగుకు ముందుకు రావడంలేదన్నారు.

## జగన్ జనం చూసి...కూటమి నేతలకు గుబులు



వాకాడు, జూన్ 20 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్లో ఎక్కడికి వెళ్లినా వచ్చే జనంను చూసిన కూటమి నేతలకు గుండెల్లో గుబులుతో పాటు వెన్నులో వణుకు పుడుతు ందని వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వాకాడు నేదురుమల్లి నివాసంలో స్థానిక నేతలు రామకుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటల్లో జన సునామిని చూసి టిడిపి నాయకులో ఇప్పటికే గుబులు మొదలైందని రానున్న ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీతో వైఎస్ఆర్సిపి అఖండ మెజార్టీతో గెలుపొందడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచి సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నాయకులు సుధాకర్ నాయుడు, నాగూర్ రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, దువ్వూరు శేషరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములును కబ్జా... పట్టించుకోని అధికారులు



పెళ్లకూరు, జూన్ 20 ప్రభాతవార్త : మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో సూళ్లూరుపేట పట్టణానికి చెందిన భూస్వామి తాల్వాయిపాడులో కొంత పొలాన్ని కొనుగోలు చేసి దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే నంబర్ 86-11,12 లో 25 సెంట్లు భూమిని ఆక్రమించడం జరిగింది. ఈ విషయంపై గ్రామస్తులు పలుసార్లు గ్రామసభల్లో మా గ్రామ అవసరాల కోసం కావాలని అర్జీలు ఇవ్వడం జరిగింది. కానీ ఎన్నిసార్లు అర్జీలు చిన్నప్పటికి స్పందించి న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు చూద్దాం చేద్దాం అంటూ కాలం వెలబుచ్చుతున్నారు. పెళ్లకూరు మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు పేదలకో న్యాయం ధనికులకో న్యాయం లాగా న్యాయం చేస్తూ చేతివాటం చూపిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇదంతా కూడా గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల అండదండలతోనే కొనసాగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తాల్వాయి పాడులోని గాయాలు భూమి అక్రమణ విషయమై పెళ్ళాకూరు తహశీల్దార్ దొరకనాథరెడ్డిని వివరణ కోరగా ఈ విషయంపై మా దృష్టికి వచ్చిందని దీనికి సంబంధించి ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి గ్రామానికి న్యాయం చేస్తామని వివరణ ఇవ్వడం జరిగింది.

## నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు అరెస్ట్!



రేణిగుంట జూన్ 20 ప్రభాతవార్త : జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి సూచనలతో రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి రేణిగుంట రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలం వద్ద ఆకస్మికంగా దాడులు నిర్వహించి నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు ఒరిస్సా రాష్ట్రం నుండి కర్ణాటక రాష్ట్రానికి రైల్లో గంజాయి తీసుకెళ్తూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన భరత్, దినేష్ (మెల్విన్),నితీష్ ఒరిస్సాకు చెందిన జోగిందర్ బచ్చా అనే వ్యక్తులు రేణిగుంట రైల్వే స్టేషన్లో రైలుదిగారు. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు హుటాహుటిన రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని తనిఖీలు నిర్వహించగా వారి వద్ద గంజాయి లభించింది. ఈ గంజాయిని కర్ణాటకకు తీసుకెళుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపారు. ఈ సందర్భంగా పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి అభినందించారు.

## ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జూన్ 20 ప్రభాతవార్త : 11వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి శనివారం నాడు నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత నెల 21వ తేది నుంచి జూన్ 21వ తేది వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు అందరి అధికారుల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అందుకు అధికారులను అభినందించారు. రేపటి రోజున జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవం జిల్లాలో 6200 ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి స్థానిక తారక రామారావు స్టేడియం నందు జరిగే యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ తగు సూచనలు ఇస్తూ రేపటి రోజున నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధి రెవెన్యూ శాఖ : జిల్లా కలెక్టర్

- ఘనంగా కలెక్టరేట్‌లో రెవెన్యూ డే దినోత్సవం



తిరుపతి కలెక్టరేట్, జూన్ 20 ప్రభాతవార్త : ప్రజలతో మమేకమై విధులను నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లాలో రెండవ రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండలాల వ్యాప్తంగా రెవెన్యూ డే సెలబ్రేషన్స్ నిర్వహించుకుంటున్నామన్నారు. రెవెన్యూ శాఖ అన్ని శాఖలతో పోలిస్తే ప్రాధాన్యత ఉన్న శాఖ అని, ప్రతి కలెక్టర్ కూడా రెవెన్యూ శాఖతోనే ముడిపడి ఉంటారన్నారు. పేద ప్రజలపై జాలి చూపెట్టి రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిప్పకుండా బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూకి సంబంధించిన సమస్యల న్నింటిని రెవెన్యూ సిబ్బంది ఎటువంటి జాప్యం లేకుండా చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ విలేజ్ రెవెన్యూ అధికారి నుంచి మండల, డివిజన్ జిల్లా స్థాయి అధికారి వరకు రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకు వచ్చేలా ప్రతి ఒక్కరు విధుల పట్ల అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శివ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వారు చేసే సేవలను గుర్తించి జూన్ 20వ తేదిని రెవెన్యూ దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర సెక్రటరీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ అవసరం అని తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు దేవేందర్‌రెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్, శివశంకర్ నాయక్, ల్యాండ్ అండ్ సర్వే శాఖ అధికారి అరుణ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీఆర్‌ఓ బాబయ్య, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు , జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది, జిల్లాలోని తహశీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తోతాపురి రైతు కన్నీటి పర్యంతం

- చెత్తబుట్టలో కేజీ రూ.12 తోతాపురి ఉత్తర్వులు
- ఫ్యాక్టరీలు, ర్యాంపుల్లో కేజీ రూ.4 కంటే తక్కువకు తోతాపురి కొనుగోలు- టోకన్లు లేక రోజుల తరబడి ఫ్యాక్టరీల ఎదుట తోతాపురి లోడ్లతో ట్రాక్టర్లు పడిగాపులు



చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త: ఈ సీజన్‌లో తోతాపురి మామిడి సాగు చేసిన రైతు జీవితం కన్నీటి పర్యంతం అయ్యింది. సీజన్ ప్రారంభంలో కేజీ రూ.20 వరకు లభిస్తుందని ఆశల పల్లకిలో విహరించిన తోతాపురి రైతుకు సీజన్ ప్రారంభమైన అనంతరం చుక్కలు కన్పిస్తున్నాయి. పండించిన తోతాపురి పంటను ఏదో ఒక ధరకు విక్రయించుకోవడానికి సైతం రైతుకు సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తోతాపురి కేజీకి రూ.12 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసినా జిల్లాలో ఆ ఉత్తర్వులు ఎక్కడ అమలు కాలేదు. కేజీ తోతాపురికి ప్రభుత్వం రూ.4 సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందని, కేజీకి మిగిలిన రూ.8ను ఫ్యాక్టరీలు, ర్యాంపులు, వ్యాపారులు రైతులకు చెల్లించాల్సి వుంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే ప్రభుత్వం కేజీ తోతాపురిపై రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేసే రూ.4 ఎప్పుడు జమ అవుతుందనేది తెలియని పరిస్థితి. అలాగే పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీ వ్యాపారులు ఎవ్వరు రైతుల నుండి కేజీ తోతాపురిని రూ.8కి ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదు. పల్ప్ ఫ్యాక్టరీలు రైతులకు మామిడి పండ్లను సరఫరా చేయడానికి మంజూరు చేసే టోకెన్లు ఎప్పుడు ఇస్తారనే విషయంపై స్పష్టత లేదు. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీ వ్యాపారులు కేజీ తోతాపురిపై రైతుకు ప్రస్తుతం రూ.4 కంటే తక్కువ ఇవ్వడానికి సిద్ధమయ్యాయి. పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులు ఈ మొత్తంను సైతం ఎప్పుడు ఇస్తాయనేది స్పష్టం చేయని పరిస్థితుల్లో వున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతు బతుకు దుర్భరంగా మారింది. జిల్లాలోని పలు పల్ప్ ఫ్యాక్టరీలకు క్రషింగ్ కెపాసిటీ తక్కువగా వుండటంతో అత్యధిక పల్ప్ ఫ్యాక్టరీలు రోజుకు 250 టన్నుల తోతాపురి మాత్రమే క్రషింగ్ చేసే అవకాశం వుంటుంది. అయితే ఒక ఫ్యాక్టరీకి రోజుకు 500 నుండి 600 టన్నుల మేరకు తోతాపురి మామిడి వచ్చి పడుతుండటంతో ఆ ఫ్యాక్టరీలకు ఈ తోతాపురి మామిడిని ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఫ్యాక్టరీలు ఒక్కరోజు మిన్నకున్నా మరుసటి రోజు మళ్ళీ 500 నుండి 600 టన్నుల తోతాపురి మామిడి ఫ్యాక్టరీలకు వస్తుండటంతో ఫ్యాక్టరీల వద్ద తోతాపురి మామిడి ట్రాక్టర్ల లోడ్లు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఒకొక్క పల్ప్ ఫ్యాక్టరీ వద్ద సుమారు వంద నుండి రెండు వందల తోతాపురి మామిడి ట్రాక్టర్ లోడ్లు బారులు తీరి వున్నాయి. ఫ్యాక్టరీలు రైతులకు టోకెన్ జారీ చేసిన అనంతరం మామిడిని ఫ్యాక్టరీలోకి తీసుకెళ్ళాల్సి వుంటుంది. అయితే ఫ్యాక్టరీ యాజమానులు రైతులకు పరిమితంగా టోకెన్లు జారీ చేస్తుండటం, ఫ్యాక్టరీల వద్ద అప్పటికే ట్రాక్టర్ లోడ్లతో మామిడి నిల్వ వుండటం, ఈ క్రమంలో మళ్ళీ కొత్త ట్రాక్టర్ లోడ్లు ఫ్యాక్టరీల వద్దకు వస్తుండటంతో ఫ్యాక్టరీల ఆవరణ మొత్తం తోతాపురి మామిడి ట్రాక్టర్ లోడ్లను క్రిక్కిరిపోతున్నాయి. జిల్లాలో గత మామిడి సీజన్‌లో పల్ప్ ఫ్యాక్టరీలు తయారు చేసిన పల్ప్ నిల్వలు ఇప్పటికి నిల్వ వున్నాయి. జిల్లాలోని అత్యధిక పల్ప్ ఫ్యాక్టరీలు సొంతంగా రైతుల నుండి మామిడి కొనుగోలు చేసి పల్ప్ తయారు చేయవు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుండి పల్ప్ తయారీకి అర్డర్లు రావడంతో పాటు పల్ప్ ప్యాకింగ్ చేయానికి సైతం అర్డర్లు ఇచ్చిన కంపెనీలు మెటీరియల్‌ను పంపితే వాటిని వుంచుకుని పల్ప్ ఫ్యాక్టరీలు పల్ప్ తయారు చేసి ప్యాకింగ్ చేస్తాయి. అయితే గత ఏడాది ప్యాకింగ్ చేసిన పల్ప్ సైతం ప్రస్తుతం ఫ్యాక్టరీల్లో నిల్వ వుండటం, ఈ సీజన్‌లో పల్ప్ తయారీకి జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుండి ఆర్డర్లు లేకపోవడం, దీనికి సంబంధించి మెటీరియల్ లేకపోవడంతో జిల్లాలోని పలు పల్ప్ ఫ్యాక్టరీలు ఈ సీజన్‌లో మామిడి పల్ప్‌ను చేపట్టకుండా మిన్నకుండిపోవాలని భావించాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తాము పండించిన తోతాపురి మామిడిని ఫ్యాక్టరీలకు ట్రాక్టర్లతో తరలిస్తుండటంతో ఫ్యాక్టరీల వద్ద తోతాపురి లోడ్ల ట్రాక్టర్లు పోటెత్తుతున్నాయి. ఇప్పటికే ఆశించిన మేరకు తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర లేదని బాధపడుతున్న రైతుకు కనీసం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కేజీ రూ.12 అయినా గిట్టుబాటు అవుతుందని భావించి ఫ్యాక్టరీల వద్దకు మామిడి పండ్లతో వస్తున్న రైతుకు ఇక్కడి పరిస్థితులతో చుక్కలు కన్పిస్తున్నాయి. కొంతమంది రైతులు ఈ సీజన్‌లో మామిడిలో నష్టం వచ్చిందని భావించి కొంతమంది రైతులు ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు పడలేక ట్రాక్టర్ లోడ్ల మామిడిని ఎక్కడ పడితే అక్కడ ఉచితంగా పడవేసి వెళ్ళిపోతున్నారు. కొంతమంది రైతులు కేజీ రూ.3కు సైతం తోతాపురి మామిడిని విక్రయించి లభించిన మొత్తంను జేబులో వేసుకుని ఇళ్ళకు వెళ్తున్నారు. జిల్లాలో తోతాపురి సీజన్ ఇప్పుడే ప్రారంభం కావడం, ఈ సీజన్ ఆగస్టు వరకు కొనసాగే అవకాశం వుండటంతో తోతాపురి మామిడి ధర మరింత తగ్గే అవకాశం వుందని అత్యధిక రైతులు భావిస్తున్నారు.

## యోగాసాధనతో వ్యక్తిత్వ వికాసం సాధ్యం

- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్



కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త : యోగా సాధనతో వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. 11వ అంతరాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కుప్పం డిగ్రీ కాలేజ్‌లో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక, శారీరక ఒత్తిడి అధికంగా ఉంటుందని దీన్ని అధిగమించేందుకు యోగా సాధన ఉత్తమ మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ నిత్యం యోగాసాధనతో చక్కటి ఆరోగ్యం సాధించవచ్చన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, సిబ్బంది వివిధ రకాల యోగాసనాలు వేశారు.

## ప్రభుత్వ విప్ కంచర్లను పరామర్శించిన కుప్పం నేతలు

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త :



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను శుక్రవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర విద్య మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మండలపార్టీఅధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, ఇతర నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య పరమపదించడంతో శుక్రవారం కుప్పం తెదేపా శ్రేణులు కందుకూరుకు చేరుకున్నారు. ఈసందర్భంగా కంచర్ల శ్రీకాంత్ కన్నీటి పర్యంతం కావడం అందర్నీ కలచివేసింది. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఆయనను ఓదార్చి ధైర్యం చెప్పారు. కంచర్ల రామయ్య పార్థీవదేహానికి కుప్పం నేతలు నివాళులు అర్పించారు. కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలనుంచి దేశం శ్రేణులు భారీగా కందుకూరుకు తరలివెళ్లారు.

## నేడు కడ అధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త: అంతర్జాతీయ యోగాదినోత్సవంను శనివారం కుప్పం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చేపట్టేందుకు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఏర్పాట్లు పూర్తి చేసింది. కుప్పం నియోజకవర్గంలో దాదాపు రెండు లక్షల మంది ఈకార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు చేపట్టారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 5వేలమందితో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టనున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేవారికి ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులను అందించనున్నారు.

## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త :

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో గణితం, హిందీ బోధించే అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఈ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయకుమార్ ప్రకటనలో తెలిపారు. తగిన విద్యార్హతలు కలిగిన వారు ఈనెల 25వతేది లోగా తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## ఘనంగా మొదలైన సల్లాపురెమ్మ..రాళ్లగంగమ్మ జాతర



శాంతిపురం, జూన్ 20 ప్రభాతవార్త : స్థానిక ఆరిముత్తనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సల్లాపురెమ్మ, శాంతిపురంలో వెలసిన శ్రీ రాళ్ల గంగమ్మ జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి శ్రీరాళ్ల గంగమ్మ కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదినారాయణ, శివశంకర్‌నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## కంచర్ల రామయ్యకు దేశం నేతల ఘన నివాళులు



కుప్పంరూరల్, జూన్ 20 ప్రభాతవార్త: ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్యకు కుప్పంలో దేశం నేతలు ఘన నివాళులు అర్పించారు. కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కంచర్ల రామయ్య చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించిన అనంతరం పూలమాలలు, పుష్పాలతో నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు. రామయ్య ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, గుడుపల్లె అధ్యక్షుడు బాబు, కౌన్సిలర్లు సురేష్, వేలు, నేతలు ప్రతాప్, ఆర్ముగం, రవినాయక్, శ్యాంసుందర్, వాసు, అప్పి, సతీష్, సుబ్బు, బిజెపి ప్రధాన కార్యదర్శి తులసినాథ్ పాల్గొన్నారు.

## ఘనంగా నారా భువనమ్మ జన్మదిన వేడుకలు



రామకుప్పం, జూన్ 20 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనమ్మ జన్మదిన వేడుకలను శుక్రవారం రామకుప్పంలో తెదేపా నేతలు ఘనంగా జరిపారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. భువనమ్మ ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, సుబ్రి, రవిరెడ్డి, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పం, జూన్ 20 ప్రభాతవార్త :

మున్సిపల్ పరిధి మోడల్ కాలనీకి చెందిన ఓ బాలిక అదృశ్యం కావడంతో కుటుంబీకులు కుప్పం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మోడల్ కాలనీకి చెందిన ఓ బాలిక స్థానికంగా ఉన్న ఓ జ్యూవలరీ షాపులో పనిచేసేది. శుక్రవారం వేతనం తీసుకునేందుకు ఆ బాలిక తల్లి షాపు వద్దకు రాగా వేతనం తీసుకున్నాక తల్లి, కుమార్తె ఇద్దరూ బయటకు వచ్చారు. మరలా దుకాణం యజమానితో మాట్లాడాలని బాలిక తల్లి దుకాణం లోపలికి వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక కన్పించకుండా పోయిందన్నారు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోగా బాధితులు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా స్విమ్స్‌లో యోగాపై సెమినార్

తిరుపతి హెల్త్, జూన్ 20 ప్రభాతవార్త :



స్విమ్స్ యూనివర్సిటీ, సిద్ధ క్లినికల్ రిసెర్చ్ యూనిట్ తిరుపతి వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా శ్రీ పద్మావతి ఆడిటోరియంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాపై సెమినార్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్, ఉప కులపతి డాక్టర్ ఆర్.వి కుమార్, అన్ని విభాగాల డాక్టర్లు పాల్గొన్నారు.

## మండల రైతులకు మొండి చెయ్యి




పూతలపట్టు, జూన్ 20, ప్రభాతవార్త: మండలం సన్నిధి మామిడి పరిశ్రమలో పూతలపట్టు మనలను చెందిన రైతులు మామిడికాయలను పూతలపట్టు మండలానికి చెందిన రైతులు సన్నిధి మామిడి పరిశ్రమకు మామిడి కాయలను ట్రాక్టర్ల ద్వారా తరలించడం జరుగుతున్నది. కానీ సన్నిధిలో కీలక పాత్ర వహించినటువంటి శంకర్ నాయుడు ప్రాంతీయ రైతులను పరిగణలోకి తీసుకోకుండా బయట నుంచి వచ్చే ఐచర్లు లారీలుతో మామిడి కాయలను సరఫరా చేసే దళారీలతో ఒప్పందం గుర్తించుకుని ప్రాంతీయ రైతులకు అన్యాయం చేస్తూ బయట నుంచి వచ్చే దళారీలకు లంచాలకు అలవాటుగా మారి గ్రామీణ రైతులకు నష్టం చేకూరే విధంగా సన్నిధి మామిడి పరిశ్రమ ఉందన్నారు. బయట వాళ్ళ ప్రమేయం లేకుండా స్థానికంగా ఉన్నటువంటి రైతులకు న్యాయం చేకూర్చే విధంగా సన్నిధి పరిశ్రమ పరిరక్షణకు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి స్థానిక రైతులు నాటుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బాలర వసతి గృహం నందు ప్రవేశాలు

పూతలపట్టు, జూన్ 20 ప్రభాతవార్త:



మండలం పి కొత్తకోట సాంఘిక సంక్షేమ బాలుర వాస్తు గృహము నందు3 తరగతి నుండి 10 తరగతి వరకు అడ్మిషన్లు జరుగుచున్నవని గృహ సంక్షేమ అధికారి జయ చంద్రారెడ్డి, సిబ్బంది జ్ఞాన శేఖర్ తెలిపారు.

## రికార్డు సృష్టించేలా ప్రపంచ యోగా దినోత్సవం

- 8.10 లక్షల మంది ప్రజలతో యోగా కార్యక్రమాలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:

జిల్లాలో శనివారం నిర్వహించనున్న 11వ ప్రపంచ యోగా దినోత్సవంను రికార్డు స్థాయిలో నిర్వహించేలా పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ బంగ్లా నుండి అధికారులు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత నెల 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు అందరు అధికారుల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందన్నారు. పూర్తయిన అనంతరం 10 గంటల్లోపు కార్యక్రమ ఫోటోలు, వీడియోలను సంబంధిత యాప్‌లో సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. సకాలంలో డేటాను అప్‌లోడ్ చేసినపుడే మనం నిర్వహించిన యోగా కార్యక్రమం విజయవంతం అయ్యిందని భావించాలన్నారు.

### నేడు మెసానికల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి యోగా కార్యక్రమం

చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో శనివారం జిల్లా స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శనివారం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు మెసానికల్ గ్రౌండ్‌లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పురప్రముఖులు, ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు, సీనియర్ సిటిజెన్లు, విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరు పాల్గొనే విధంగా సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## మద్యం సేవించి పట్టుబడిన వారికి జరిమానా

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:



చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులు ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 40వేల రూపాయల జరిమానా విధించినట్లు టుటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు. అలాగే బహిరంగంగా మద్యం సేవించి పట్టుబడిన ఇద్దరికి ఒకొక్కరి నుండి వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతాయని, ఈ రకమైన చర్యలు ఎవరైనా చేస్తే తీవ్రంగా తీసుకుంటామని హెచ్చరించారు.

## మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన షణ్ముగం

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:



జాతీయ బీసీ సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం శుక్రవారం మచలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి కొల్లురవీంద్రను కలిశారు. మంత్రి కొల్లు రవీంద్ర జన్మదినం పురస్కరించుకుని జాతీయ బీసీ సంక్షేమ సంఘ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం ఆయనకు తిరుమల-తిరుపతి దేవస్థానం ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా షణ్ముగం మంత్రి కొల్లు రవీంద్రను శ్రీవారి శేష వస్త్రాలతో సత్కరించి పుష్కగుచ్చాలు అందజేశారు.

## ఘనంగా కోలా ఆనంద్ జన్మదినం

చిత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త:



రాష్ట్ర బిజెపి కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు శ్రీకాళహస్తిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు బిజెపి నాయకులు చిట్టిబాటు కొల్లా ఆధ్వర్యంలో చిత్తూరు బిజెపి నాయకులు కోలా ఆనంద్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామభద్ర, కరుణాకర్, సిద్ధు, ఉదయ్, సోమనాథ్‌గౌడ్, రెడ్డి మస్తాన్, శేషాద్రి, సుబ్బారెడ్డి, సేతకుమార్, ప్రసాద్, హేమచంద్ర, మణివర్మ, గురుగణేష్ పాల్గొన్నారు.

## ఐటిఐకి రెండవ విడత ధరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం, జూన్ 20 ప్రభాతవార్త :

పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేదలచుకున్న విద్యార్థులకు రెండవ విడత ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. వెదురుకుప్పం పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2025-2026 విద్యాసంవత్సరంలో మిగిలిఉన్న కంప్యూటర్, డ్రస్‌మేకింగ్, డీజిల్ మెకానిక్ ఒక ఏడాది కోర్సులు, ఎలక్ట్రీషయన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్ రెండు సంవత్సరాల కోర్సులు సీట్ల భర్తీకి ధరఖాస్తులు కోరడమైవుతుందన్నారు. ఆశక్తిగల అభ్యర్థులు జూలై 15 సాయంత్రం లోపు ఆన్‌లైన్ ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌ప్రోటర్లలో ధరఖాస్తు చేసుకోవలని చెప్పారు. అలాగే పదవ తరగతి పెయిల్ అయిన అభ్యర్థులు డ్రస్ మేకింగ్ కోర్సులకు అర్హులని చెప్పారు.

## కేశవుల రెడ్డి కుటుంబంను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

వెదురుకుప్పం, జూలై 20 ప్రభాతవార్త :



కర్ణాటక హోస్కోట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆళ్ళమడుగు చెందిన కేశవులరెడ్డి కుటుంబంను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ నుంచి ఐదు లక్షల రూపాయాలు ఆర్థిక సాయం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహానిధి నుంచి నగదు మంజూరు చేయించి ఆదుకుంటామన్నారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మండల క్లష్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి, నాయకులు దామోదర్ రెడ్డి, మహేష్, భాస్కర్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, విజయసింహారెడ్డి, నాగరాజురెడ్డి, నాగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు

పుంగనూరు, జూన్ 20 ప్రభాతవార్త :



దశాబ్దాల తరబడి ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులుగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడడం తప్పని, రక్షణ సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ఐదో రోజు నిరసన జరిగింది. మధ్యాహ్న భోజన సమయంలో మున్సిపల్ కార్మికుల సంఘం సభ్యులు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచి సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్టేషన్‌ను ఆశ్రయించిన ప్రేమజంట

చౌడేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:



ప్రేమజంట పోలీస్టేషన్‌ను ఆశ్రయించి, తర్వాత పెద్దల సమక్షంలో వివాహం జరిగిన సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పెద్దకొండామర్రికి చెందిన సుధాకర్(30), చారాల శ్రావణి(27)లు పరస్పరం ప్రేమించుకొన్నారు. కొనాళ్ళకు ఇరువురు పెళ్ళి చేసుకోవాలనుకొన్నారు. అయితే పెద్దలు అంగీకరించరన్న భయంతో పోలీస్టే షన్‌ను ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబ సభ్యులను పిలిపించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో మాలమహానాడు, శ్రావణి తండ్రి శంకరప్ప, సుధాకర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దొరబావి అభయ అంజనేయస్వామి ఆలయంలో పెళ్ళి చేసారు. ఎంఎంనాడు నాయకులు కొత్తపల్లి మణి, కృపామణి, గుట్ట రెడ్డిశేఖర్, యల్లకుంట్ల మణి, సురేష్, తదితరులు పెళ్ళి చేసిన వారిలో వున్నారు

## పరిమళించిన మానవత్వం...బడికి చేరిన ఎస్టీ పిల్లలు!

చౌడేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త :



చౌడేపల్లి పరిధిలోని యానాదికాలనీకి చెందిన బడిఈడు బాల, బాలికలున్నారు. ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో వారి తండ్రులను కోల్పోయారు. దీంతో స్పందించిన గోసలకురపల్లికి చెందిన డాక్టర్ మహేష్ బాబు వారి చక్కటి భవిష్యత్తును చూపించాలనుకొన్నాడు. పిల్లలకు ఆధార్‌కార్డులు తీయించి, దాతల సహకారంతో దుస్తులు, విద్యావుపయోగకర వస్తువులతో గోసలకురపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. అంతే కాకుండా ఆరుమంది యానాది పిల్లలను వసతిగృహంలో చేర్పించేలా చర్యలు తీసుకొన్నాడు. దీంతో కాలనీవాసులతోపాటు స్థానికులు మహేష్‌ను అభినందించారు.

## గంగమ్మకు బంగారం బొట్టు బహూకరణ

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 20 ప్రభాతవార్త:



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాత బంగారం గిన్నెబొట్టును బహూకరించారు. చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లికి చెందిన నాగేశ్వరరావు దంపతులు దాదాపు రూ. 35వేలు విలువ చేయు గిన్నెబొట్టును ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరంకు అందించారు. ఆ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అలంకరించారు. దాతలను ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలు : తేదేపా

చౌడేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త :



కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని తేదేపా మండల పరిశీలకుడు దేవిరెడ్డి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి)లన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీ బోయకొండ భవానీ నగర్‌లో తేదేపా మండలస్థాయి గ్రామ కమిటీల అధ్యక్ష కార్యవర్గ సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికయిన కమీటీలకు దిశా, నిర్దేశం చేసారు. నాయకులు పూల చంద్రమౌళి, శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ సుబ్బు, సోము, రెడ్డి, పంజానిపల్లి బాబునాయుడు, వేలూరు సుబ్రమణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రమణ, ముని, ఆయా పంచాయతీల గ్రామకమిటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవమానపరచిన వారిపై చర్యలు తీసుకోవాలి

చౌడేపల్లి, జూన్ 20 ప్రభాతవార్త:



దళిత సర్పంచును సభసాక్షిగా అవమాన పరచిన కూటమి ఎమ్మెల్యేపై చర్యలు కోరుతూ కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు నందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు జిల్లా ఆదోని నందు జరిగి కూటమి ప్రభుత్వ సభలో మొదటి పౌరుడైన సర్పంచును వేదికపైకి రానివ్వకుండా కులం పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘ డివిజన్, మండల నాయకులు డాక్టర్ చంద్ర, వాసులు డిమాండ్ చేసారు. మల్లేస్, మునిరత్న, లక్ష్మయ్య, వెంకట్రెడ్డి, కృష్ణారెడ్డి, అల్లాభాషా, రెడ్డెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి బస్టాండ్ వద్ద యోగ సన్నాహాలు

పుంగనూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం ఉదయం పుంగనూరు పట్టణంలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు మొదలయ్యాయి. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ సారథ్యంలో యోగ దినోత్సవం కోసం విస్తృత ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అన్ని పాఠశాలలు అనే ప్రభుత్వ శాఖలు సిబ్బంది విద్యార్థుల ఆధ్వర్యంలో కొన్ని వేల మంది ఏకకాలంలో యోగా నిర్వహించేందుకు అనువుగా ఆర్టిసి బస్టాండ్ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## రెవెన్యూ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

రామచంద్రాపురం, జూన్ 20 ప్రభాతవార్త:

రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని తహశీల్దార్ వెంకటరమణ సూచిం చారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ ఉద్యోగులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర ఎనలేనిదన్నారు. భూ రికార్డుల నిర్వహణ, హద్దులు నిర్ణయించడం వంటి ఎన్నో సేవలు ప్రజలకు అందించడంలో వివాద రహితంగా రెవెన్యూ ఉద్యోగులు చేస్తున్న కృషి అభినీయమన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్ఓలు, విఆర్ఏలు, పాల్గొన్నారు

## తనయుడి మరణం తల్లిడిల్లిన హృదయం



చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త: తనయుడి మరణంతో తల్లిదండ్రుల హృదయాలు తల్లడిల్లిన విచారకర దుర్ఘటన గురువారం రాయలపురంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకెళితే.. రాయలపురంకు చెందిన అనురాధ, బాలకృష్ణ దంపతులకు ముగ్గురు సంతానం కాగా చిన్నకుమారుడు సాల్మన్ (13) గురువారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటుండగా గేటు తగిలి ప్రమాదవశాత్తూ క్రిందపడ్డాడు. తలకు గాయం కావడంతో మూర్ఛగిల్లిన కుమారుడిని హుటాహుటిన చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్సలు అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపడంతో అక్కడ వైద్య చికిత్సలు పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల వేదన హృదయవిధాకరంగా మారింది. బాలుడి మృతితో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

## కార్మిక హక్కులు హరించరాదు

పాకాల, జూన్ 20 ప్రభాతవార్త :



మండలం స్థానిక ఆటో స్టాండ్ కూడలి వద్ద రోజుకు 12 గంటల పని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు నిరసన వ్యక్తం చేసారు. పెరుగుతున్న నిత్య అవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగటం లేదు అని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆనంద్, మురళి, రాజు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మయ్య, ఆకర్స్, యూనియన్ నాయకులు వెంకటరమణ, పంచాయతీ సంఘం యూనియన్ నాయకులు మురళి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ మండల అధ్యక్షులు నరేంద్ర మద్దతు ప్రకటించారు.

## వికసిత్ భారతదేశపు అమృతకాలం

తిరుచానూరు, జూన్ 20 ప్రభాతవార్త:

వికసిత భారత దేశపు అమృతకాలం భారతదేశపు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాత్రమే సాధ్యం అని తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. పార్టీ సుపరిపాలన, పేదల సంక్షేమనికి 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, ఆ పార్టీ కేంద్రం ఆదేశాల మేరకు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ నరేష్, తిరుచానూరు మాజీ మండల అధ్యక్షుడు విజయకుమార్, రూరల్ మండలంకి చెందిన తిరుణామలి రూపేష్ బాబు, తిరుచానూర్ పంచాయతీ మాజీ అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

## దరఖాస్తులు వెంటనే పరిష్కరించండి : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త:** తిరుపతి నియోజకవర్గ పరిధిలో అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ నగరంలోని ప్రజల నుండి వచ్చిన ఫారం 6,7,8 వంటి దరఖాస్తులను బి.ఎస్.ఓ.లు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లను ఇంకా నియమించలేదని, త్వరగా నియమించుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు ప్రజల నుండి వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలించామని, వాటి వివరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో అమ్మకానికి 'చాలుక్య' !

-కార్పొరేషన్‌కు నిధులు లేవంటూ కూటమి కార్పొరేటర్లు పట్టు

తిరుపతికార్పొరేషన్, జూన్ 20ప్రభాతవార్త: తిరుపతి నగరంలో అత్యంత ప్రాధాన్యత ఉన్నప్రాంతంలో వందలకోట్లరూపాయలు విలువైన కార్పొరేషన్ ఆస్తిని అమ్మేందుకు ఎట్టకేలకు కౌన్సిల్ నిర్ణయించడం తిరుపతిజనంలో విస్మయం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి పార్టీల్లో స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు, మరో కార్పొరేటర్ ఇద్దరూ కలసి ఈ స్థలంపై కన్నేశారనేది ప్రజల్లోనేగాక ప్రతిపక్ష వైసిపి భగ్గుమంటోంది. అయితే 47మంది కార్పొరేటర్లలో హాజరైన 42మందిలో 30మంది వైసిపి కార్పొరేటర్లు స్థలం అమ్మరాదని వ్యతిరేకించారు. 12మంది మాత్రమే అనుకూలంగా రావడంతో ఆ స్థలం అమ్మకం వాయిదాపడింది. కానీ కార్పొరేషన్‌లో అంతా తానై వ్యవహరిస్తున్న ఓ కార్పొరేటర్ జనసేనపార్టీ నేతతో కలసి స్థలం అమ్మడానికి పట్టుబడుతున్నట్లు తేలిపోయింది. చాళుక్య అమ్మకంపై ఏర్పాటుకానున్న కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి పిపిపి విధానంలోగానీ, విక్రయించడంగానీ చేస్తామని కమిషనర్ ప్రకటన ఎక్కడకు దారితీస్తుందో చూడాల్సిందే



## శ్రీవారి సేవలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

తిరుమల, జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు కలెక్టర్‌కు దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా శ్రీవకుళామాత ఆలయ తృతీయ వార్షికోత్సవం



తిరుపతిరూరల్, జూన్20 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో శ్రీవకుళామాత ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి తల్లియైన శ్రీవకుళామాత ఆలయంలో శాస్త్రోక్తంగా శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు కైంకర్యాలు నిర్వహించారు. వకుళామాతకు రూ.4.5లక్షల బంగారుపూత వెండి కిరీటం బహుకరణ శ్రీవకుళామాత ఆలయ తృతీయ వార్షికోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన ఆర్.అమర్‌నాథ్, శైలజ దంపతులు శ్రీవకుళామాత అమ్మవారికి రూ.4.50లక్షల విలువైన బంగారు పూతపూసిన వెండి కిరీటాన్ని ఆలయ డిప్యూటీవో వరలక్ష్మీకి అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధ్వర్యంలో పచ్చదన పరిరక్షణ



తిరుపతి విద్య, జూన్ 20 ప్రభాతవార్త: స్థానిక భవాని నగర్ సర్కిల్ లో ఉన్న గీతం పాఠశాల విద్యార్థులు సిద్ధ యోగా క్లినికల్ వారు నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ పచ్చదన పరిరక్షణ అనే కార్యక్రమానికి హాజరై తమ యోగా నైపుణ్యంతో అందరినీ ఆకర్షితులను చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ యోగ వ్యాయామం కాదని ఆత్మకి భగవంతునికి మధ్య అనుసంధానం చేసే ఒక ప్రక్రియ అని తెలియజేస్తూ ఆసుపత్రికి డాక్టర్లకు దూరంగా ఉండాలంటే ప్రతి రోజు యోగా చేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుంచే అడవుల పరిరక్షణ మొక్కల పెంపకంపై అవగాహన తెలపడం తమ బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

తిరుపతి విద్య, జూన్ 20 ప్రభాతవార్త: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో డొమెస్టిక్ డెటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్ ఎస్ సి ఉత్తీర్ణత ఆపైన విద్యార్హతలు కలిగి 18 ఏళ్ల వయస్సు నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న మహిళ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.390గంటల కాలవ్యవధిగల ఈ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్తో పాటు మరిన్ని వివరాలకోసం 9533889902 నంబర్ నందు సంప్రదించాలని కోరారు.

## కూటమి దెబ్బకి చెవిరెడ్డికి దిమ్మతిరిగి...జైలుకెళ్ళాడు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 20 ప్రభాతవార్త : కూటమి ప్రధానంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దెబ్బకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి దిమ్మతిరిగి జైలుకు వెళ్ళాడని టీడీపీ నేతలు, తుమ్మలగుంట బూత్ ఇన్‌చార్జి, కన్వీనర్ బిరుదాల సిద్ధారెడ్డి, తుమ్మలగుంట గ్రామ కమిటి అధ్యక్షులు పార్లపల్లి భరత్‌కుమార్ అలియాస్ భాను అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో చంద్రగిరి నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆడిందే ఆట, పాడిందే పాటగా తన హవా జరిగిందన్నారు. ప్రధానంగా తుమ్మల గుంటలో ప్రభుత్వ, హాథీరాంజీ మఠం, కాలువ పరంబోకు భూములు చివరికి తాత ముత్తాతుల నుంచి తమ కుటుంబాలకు చెందిన సొంత పట్టా భూములను సైతం చెవిరెడ్డి తన అనుచరులతో కబ్జా చేయడం జరిగిందన్నారు. అలాంటి వ్యక్తి నేడు జైలు వెళ్ళడంతో చంద్రగిరి నియోజక వర్గంలో కూటమి ప్రధానంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు.

## అభాగ్యురాలికి... సర్పంచ్ ఆసరా!



రేణిగుంట జూన్ 20 ప్రభాతవార్త : దిక్కు ముక్కు లేని ఓ అభాగ్యురాలికి రేణిగుంట సర్పంచ్ నాగేశం ఆసరాగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆకలితో అలమటిస్తున్న సుమారు 95 సంవత్సరాల వృద్ధురాన్ని స్థానికులు గుర్తించి సర్పంచ్ నాగేశంకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆమెకు పంచాయతీ సిబ్బందితో స్నానం చేయించి కొత్త బట్టలు ఇచ్చి స్థానికంగా ఉన్న అభయ క్షేత్రానికి గురువారం ఆటోలో తరలించారు. అప్పటికే ఆమె అనారోగ్యంతో ఉన్నట్లు గ్రహించిన సర్పంచ్ స్థానిక ప్రముఖ డాక్టర్ జనార్ధన్‌ను శుక్రవారం అభయ క్షేత్రానికి తీసుకెళ్లి ఆమెకు వైద్య సేవలు చేయించి కావలసిన మందులను ఇప్పించారు. అభయ క్షేత్రం డైరెక్టర్ తస్లీమా అభాగ్యురాలికి అమ్మలాగా ఆశ్రయం కల్పించారు.

## రేణిగుంట తహసిల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



రేణిగుంట జూన్ 20 ప్రభాతవార్త: రేణిగుంట తహశీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు రేణిగుంట తహసిల్దార్ గా విధులు నిర్వహించిన సురేష్ బాబు సాధారణ బదిలీలో భాగంగా తిరుపతి అర్బన్ కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిత్తూర్ అర్బన్ నుండి చంద్రశేఖర్ రెడ్డి రేణిగుంటకు బదిలీ వచ్చారు. అంతకుముందు వీఆర్ఏ సంఘం నాయకుడు హరి, వీఆర్ఏలు మహేష్, నాగరాజ్, సుభాషిణి, సురేష్, కిషోర్, తదితరులతో పాటు డిప్యూటీ తహసిల్దార్ శ్యాంప్రసాద్, సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.



## మా ఐదు ఎకరాల ఆస్తిని డీటీ అమ్మేశాడు

– బాధితురాలు అరుణ ఆవేదన

తిరుపతి హెల్త్, జూన్ 20 ప్రభాతవార్త : మా తాత ముత్తాతుల నుంచి సంక్రమించిన ఐదు ఎకరాల ఆస్తిని డీటీ అందరికి అమ్మేశాడని బాధితురాలు అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిచ్చాటూరు మండలం, వేలూరు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలో మొత్తం 23 సర్వే నెంబర్లలోని భూమిని ఐదు ఎకరాల్లో అర్ధభాగం స్థానిక ప్రజలకు రాసి ఇవ్వడం దారుణమన్నారు. మిగిలిన అర్ధభాగాన్ని సైతం అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని బాధపడ్డారు. ప్రస్తుత వీఆర్వోను అడిగితే అప్పటి డీటీని చొక్కా పట్టుకుని అడగండని సమాధానం చెప్పడం బాధాకరమన్నారు. గత 12 సంవత్సరాలుగా తాను, తన తమ్ముడు కలెక్టర్, తహశీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా తనకు న్యాయం జరుగుతోందని జర్నలిస్టు సోదరులకు చెప్పుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అలాగే మరో బాధితుడు ఎలుమలైరెడ్డి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ అదే మండలం, రామగిరి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలలో ఉన్న 0.80 సెంట్ల భూమిని వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయడం దారుణమన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరారు.

## రైతులకు ప్రభుత్వానికి వారధి రెవెన్యూ..!



చంద్రగిరి, జూన్ 20 ప్రభాతవార్త : రైతులకు ప్రభుత్వానికి వారధి వంటిది రెవెన్యూ విభాగమని తహశీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 20న రెవెన్యూ దినోత్సవం జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే సర్టిఫికెట్లు వంటి తదితర రెవెన్యూ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దివాకర్, ఈసిడిటి మహేశ్వరి, ఏఎస్ఓ స్వర్ణలత, సర్వేయర్ సురేష్‌బాబు, విఆర్ఓలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిందితునికి కోర్టులో విముక్తి

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి సమీపంలోని బసవయ్యపాళెం సమీపంలో ఓ మినిలారీ వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న ఓ మోటార్ సైకిలిస్టును ఢీకొనగా ఆతను మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడుగా డ్రైవర్ కృష్ణమిశ్రను ఐపిసి సెక్షన్ 304ఏ,338 ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసారు. ఈ కేసుకు సంబందించి శ్రీకాళహస్తికి చెందిన క్రిమినలన న్యాయవాది విప్పరపల్లి సాయిరాం వాదించారు. ఈ కేసులు 11 మంది సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జేరేపల్లి కృష్ణప్రియ డిఫెన్స్ న్యాయవాది వాదనలతో ఏకీభవిస్తూ నిర్ధోషిగా భావించి కేసునుకొట్టి వేయబడిందని న్యాయవాది సాయిరాం తెలిపారు.

## శివయ్య హుండీ ఆదాయం రూ.1,45కోట్లు



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లు, పరివార దేవతల ఆలయాల వద్ద భక్తులు 23రోజుల పాటు సమర్పించిన కానుకలను లెక్కించారు. హుండీల్లో సమర్పించిన కానుకలను మందుకొట్టు మండపం భవనంలో లెక్కించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారధ్యంలో లెక్కింపు జరిపారు. ఈ లెక్కింపుల్లో నగదు రూ.1,39,30,362లు వచ్చింది. చిల్లర నాణెములు రూ.6,09,214లు రాగా విదేశీ కరెన్సీ 106 నోట్లు వచ్చింది. బంగారు 39 గ్రాములు వచ్చినట్లు లెక్కింపు పూర్తి అయిన తరువాత దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న భక్తులు సమర్పించిన వెండి రాహుకేతు పడగలు 503కిలోలు భక్తులు కానుకలుగా సమర్పించిన వెండి 130 గ్రాములు ఉన్నట్లు ప్రకటించారు. ఆలయానికి చెందిన ఉద్యోగులు లెక్కింపుల్లో పాల్గొన్నారు.

## ఘనంగా రెవెన్యూ దినోత్సవం



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 20 ప్రభాతవార్త : తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ సారధ్యంలో నిర్వహించిన సంబరాల్లో జెండాను ఎగురు వేసారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో రెవెన్యూశాఖ కీలకమైందన్నారు. బ్రిటిష్ పాలనకు ముందు మన దేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉండేదన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి పరిపాలనకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే రెవెన్యూ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు వివరించారు. సత్కారం పొందిన వారిలో రవీంద్రనాథ్, నాగరాజులను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ రమాకాంత్ విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఏడాది సంబరాలు



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా జనసేన పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించి ఏడాది అయిన సందర్భంగా శ్రీకాళహస్తిజనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరుజిల్లా కార్యదర్శి కొట్టె సాయి సారధ్యంలో సంబరాలు జరుపుకున్నారు. భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చూపని ధాతృత్వాన్ని ప్రదర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో గరికపాటి రమేష్, ఇర్లచిరంజీవి, ఢిల్లి బాబు బద్రి, పగడాల ప్రతాప్, అరిగల వేణు, కవిత, పేట చంద్రశేఖర్, చిరంజీవి, తేజ, లక్ష్మణ్ ప్రదీప్ కుమార్, మహేష్, మునిచంద్ర, మునికుమార్, రమేష్‌బాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

## స్టేట్‌బ్యాంక్ సారధ్యంలో అన్నదానం



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేయిన్ బ్రాంచి సారధ్యంలో శుక్రవారం డివిజన్‌లోని అన్ని బ్రాంచిలకు చెందిన ఉద్యోగులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకులు కామ్రేడ్ వై.తారకనాథ్ 21వ వర్థంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసారు. ఆయన సేవల్ని స్టేట్‌బ్యాంకులో పని చేసే ప్రతి ఒక్కరు గుర్తించుకోవాల్సి ఉందన్నారు. అందుకు నిదర్శనంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కోవనూరు, మెయిన్ బ్రాంచి, ఎడిబి, స్కిట్, దేవస్థానం బ్రాంచిల మేనేజర్లు ఫణి శ్రీనివాస్, (ఫణి కుమార్) జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాత నేరస్థుడు అదుపు



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోనూ, పరిసరాల్లోని ఇళ్ళలో చోరికి పాల్పడిన దొంగ పీలేరు సబ్‌జైలులో ఉండగా టూటౌన్ పోలీసులు కావడి సోమశేఖర్ (29)ని అదుపులో తీసుకొని కోర్టుకు హాజరు పరచినట్లు సిఐ నాగార్జున్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తిలోని కైలాసగిరి, జర్నలిస్టు కాలనీల్లో రాత్రిపూట ఇళ్ళలో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేయటం ఆతని వృత్తిగా గుర్తించినట్లు వివరించారు. కోర్టుకు హాజరు పరచగా 14రోజులు రిమాండ్ ప్రకటించినట్లు వివరించారు.



## దేశం కార్యకర్తకు నివాళి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 20 ప్రభాతవార్త : మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త ద్వితీయ శ్రేణి నాయకుడు కోటేశ్వరరావు హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. భౌతికాయానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు. గ్రామానికి చెందిన నరసయ్య, హరిప్రసాద్, నారాయణ, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌రాష్ట్ర మోటార్ సైకిల్ దొంగ అరెస్టు



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : నిత్యం మోటార్ సైకిళ్ళు చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను పట్టుకున్నట్లు శుక్రవారం టూ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఒకరిని అదుపులో తీసుకున్నామని మరోకరు పారిపోయాడని ఆతని కోసం వెతుకున్నామని సిఐ వివరించారు. వీరు మోటార్ సైకిళ్ళను దొంగలించి తమిళనాడుకు తరలించి అక్కడ విక్రయిస్తున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ చోరి కేసులో తమిళనాడులోని తిరువూరు జిల్లా చోలమాదేవి గ్రామానికి చెందిన ఆదంసా(37) పొట్టి శ్రీరాములు జిల్లాకు చెందిన మరోకరితో స్నేహం చేసి ఇద్దరు ఇళ్ళ ముందు నిలబెట్టిన మోటార్ సైకిళ్ళను చోరి చేసి తమిళనాడుకు తరలించి అక్కడ విక్రయించే వారని తమ విచారణలో తేలిందన్నారు. ఈ ముఠా కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు సిఐ తెలిపారు. ఈ నిఘాలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ అరుణ్‌కుమార్, బాబు, నందకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారని వివరించారు

## ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు

నారాయణవనం, జూన్ 20 ప్రభాతవార్త :



శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎంపిపి పి.దివాకర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపిప్పి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూశాఖ అందిస్తున్న సేవలు అమోగమని తెలిపారు. రెవెన్యూశాఖ ఎన్నికల ప్రక్రియలో కూడా వారు అందించే సేవలపట్ల కొనియాడారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూడా ధృవీకరణపత్రాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా భూమి పట్ట పాసుపుస్తకం, ఆన్లైన్ నమోదు, ఇంటి పట్టాలు, భూ వివాద సంబందిత సర్వేలు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు వంటి అనేక సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పలువురుకి వివిధ రకాల సేవలకు సంబందించిన పత్రాలను అందించారు. మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, తహశీల్దారు జయరాములు, డిప్యూటీ తహశీల్దారు హరిబాబు, నాయకులు కె సాయిరవికుమార్, నాగూరు, గాండ్ల శివకుమార్, కెజి లక్ష్మణన్, మురళి, రెవెన్యూ సిబ్బంది అందరు పాల్గొన్నారు.

## ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



తిరుపతి క్రీడ, జూన్ 20 ప్రభాతవార్త: ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను రవినాయుడు టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతిలోని రుయా ఆసుపత్రి వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వద్ద టీమ్ రవినాయుడు సభ్యులందరూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, తెలుగు యువత నాయకులు తోట వాసుదేవ, రంజిత్ నాయుడు, సునీల్ కుమార్ రెడ్డి, సుబ్బు యాదవ్, దిలీప్ రాయల్, బాబీ రాయల్, శరత్, రూపేష్, ధోనీ రెడ్డి, లోకేష్ రాయల్, పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీవకుళమాత అమ్మవారి సేవలో పెద్దిరెడ్డి కుటుంబం



తిరుపతిరూరల్, జూన్20 ప్రభాతవార్త: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం శ్రీవకుళమాత అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు చేసారు. తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయం విరాజిల్లుతున్న విషయం తెల్సిందే. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి తల్లియైన శ్రీవకుళమాత ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారుఉదయం11-12గంటలమధ్యఉత్సవమూర్తులకుఅష్టోత్తర శతకలశాభిషేకము నిర్వహించారు.

## ఘనంగా గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు



నింద్ర, జూన్ 20 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో మాజీ శ్రీశైలం బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వంరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశ్వర్లు చౌదిరి, రఘుయాదవ్, బాబుయాదవ్, నాగభూషణంరాజు, లోకనాథంనాయుడు, రామూర్తినాయుడు, రఘురామ్, రవినాయుడు, విజయ్‌కుమార్, కిష్టయ్య పాల్గొన్నారు.

## ఆథరైజేషన్ లైసెన్స్ సర్టిఫికేట్ అందజేత



తిరుపతిరూరల్, జూన్20 ప్రభాతవార్త: 'రెవెన్యూ డే'ని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రామ్మోహన్ చేతుల మీదగా తిరుపతి, తిరుపతిరూరల్ రేషన్ డీలర్స్‌కు ఆథరైజేషన్ లైసెన్స్ రెన్యూవల్ సర్టిఫికేట్‌ను అందజేసారు. లబ్దిదారులకు రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలని సూచించారు. లబ్దిదారుల నుండి ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలు లేకుండా తూకాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా రేషన్ సరుకులు అందజేయాలని ఆర్డీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి.ఝాన్సీలక్ష్మీ, రేషన్ డీలర్స్ తిరుపతిజిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు, తిరుపతిరూరల్ మండల అధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు, తిరుపతిఅర్బన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యధర్శి పి.హేమలత, మునికృష్ణారెడ్డి, లక్ష్మణరావు, దొరస్వామియాదవ్, రాజేశ్వరమ్మ, శ్రీనాథ్, శ్రీహరి, ధనలక్ష్మీ, పుష్పాంజలి, ప్రమీళమ్మ, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి అర్బన్ తహశీల్దార్‌గా సురేష్‌బాబు



తిరుపతిరూరల్, జూన్20 ప్రభాతవార్త: తిరుపతి అర్బన్ తహశీల్థార్‌గా వి.సురేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా రేణిగుంట తహశీల్థార్‌గా ఉన్న సురేష్‌బాబు తిరుపతిఅర్బన్‌కు బదిలీ కాగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కెపి భాగ్యలక్ష్మీ చినగొట్టుకల్లు మండలానికి బదిలీపై వెళ్ళారు.

## పని గంటలు పెంపుకు నిరసన

తొట్టంబేడు, జూన్ 20 ప్రభాతవార్త :




పని గంటల పెంపుకు వ్యతిరేకంగా శుక్రవారం ఎఐటియుసి సారధ్యంలో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కత్తి రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పని గంటలు పెంపుకు పూనుకోవటం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు పది గంటలు పని చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసి జీవోను విడుదల చేయటం దారుణమన్నారు. ఇది కార్మికులను మరింత నిరాశ పరచటానికి మూలం అన్నారు. ఈ కార్యక్రమాల్లో తొండు మల్లికార్జున్, గోపి, మురళి, అయ్యప్ప, దిలీప్, గిరిబాబు, దయాకర్, గంధం మణి, గుర్నాథం వెంకటేశ్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. వినతి పత్రాన్ని ఆర్‌డిఓ కార్యాలయ ఉద్యోగులకు అందించారు.

## లెక్కకు మించి ద్విచక్రవాహనాలు...



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం పార్కింగ్‌కు సంబంధించి ఎన్ని నిబంధనలు విధిస్తున్నా, రోడ్లు వెడల్పు చేస్తున్నా ద్విచక్ర వాహనాలకు సంబంధించిన కేటాయించిన పార్కింగ్ స్థలం చాలటం లేదు. దాంతో మళ్ళీ జ్ఞాన ప్రసూనాంబ సదన్ నుంచి పరిపాలనా భవనాల వరకు వేసిన చల్లటి పందిళ్ళ కింద కొందరు తమ ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దాంతో కొందరు 'నిబంధనలు కొందరికేనా' అంటూ చర్చించు కుంటున్నారు. ఇఓ డి.బాపిరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నారు. నాలగవ గేటు నుంచి పాత ధూర్జటి కళాప్రాంగణం వరకు ద్విచక్రవాహనాలకు పార్కింగ్ కోసం నీడ కూడా కల్పించారు. అయితే ఇది చాలటం లేదు, దాంతో కొందరు లోపలకు వెళుతున్నారు. అడ్డగించిన సెక్యూరిటి మీద గుర్రుమంటున్నారు.

## మహిళలను గౌరవించాలి!:రేహాన్



శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త : మహమ్మద్ ప్రవక్త కాలం నుంచి మహిళలను గౌరవించే సంప్రదాయం ఇస్లాం మతంలో ఉందని దానిని మనం ఆచరించాలని హాఫిజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను కొందరు అనుచరులు మీకు ఎవరంటే ఎక్కువ ప్రేమ అని ప్రశ్నించగా మహిళలంటే అని సమాధానం చెప్పారన్నారు. నాడు సమాజంలో ఆడిబిడ్డ పుడితేనే అవమానంగా భవించటం, సజీవంగా ఖననం చేసే సంప్రదాయం ఉండేదన్నారు. అయితే నేడు సమాజంలో మహిళలంటే ఒకే దృష్టితో చేస్తున్నారని ఇది సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన రోజులన్నారు. ఏ సమాజంలో అయితే మహిళలు గౌరవింపబడతారో అక్కడ ప్రశాంత వాతావరణం ఉంటుందని రేహాన్ వివరించారు.

## గురుకులాకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26కు సంబంధించి 6,7,8,9 తరగతుల్లో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలోని బాలుర పాఠశాలలో నాయుడుపేట, చిల్లకూరు, కోట, వాకాడులలో అలాగే బాలికల గురుకులాలు పుదూరు, సూళూరుపేట, డక్కిలి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పుత్తూరు పాఠశాలలున్నాయని వివరించారు. విద్యార్థులు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25 న ఉదయం 10గంటల నుంచి 11 గం టల వరకు శ్రీకాళహస్తిలోని బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణులైన వారిని చేర్చుకోబడుతుందని టి.పద్మజ వివరించారు.

## పార్టీ కార్యాలయంలో భువనేశ్వరి జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలోని ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారాభువనేశ్వరి జన్మదిన వేడుకలను తెలుగుదేశం మహిళలు భారీ ఎత్తున నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళలు హాజరు కాగా వారి మధ్య శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు కేక్ కట్ చేసారు. కార్యక్రమాలను పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్య వైకాపా పాలనలో నారాభువనేశ్వరి ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. వారితో పాటు మహిళా నాయకురాలు బూడిదవాకం రేణుకాదేవి, సుమతి, మల్లీశ్వరమ్మ, మైనారిటి నాయకులు షాకిర్ అలి, ఖాదర్‌బాషా, జీలాని, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో జాతీయ మహిళా కమిషన్

శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం జాతీయ మహిళా కమిషన్ చైర్మెన్ డాక్టర్ అర్చన మంజూదార్ దర్శించుకున్నారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో పిఆర్ఓ రవి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయదర్శనం చేసుకున్న ఆమెకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వ చనాలు అందించి స్వామి అమ్మవార్లచి త్రపటాలను ఎఇఓ మోహన్ అందించారు.

## నేటి తరానికి ఎన్టీఆర్ స్ఫూర్తి : ఎమ్మెల్యే నెలవల

సూళ్లూరుపేట, జూన్ 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత నేత ఎన్టీ రామారావు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహానికి ఎదురుగా ఉన్న రహదారిపై ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సూళ్లూరుపేటలో మహానేత ఎన్టీ రామారావు విగ్రహం లేకపోవడంతో తాము ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సహకారంతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పార్థసారధి, తెలుగుదేశం పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పచ్చా మాధవనాయుడు, మేడా సాయినారాయణ, వాకిచర్ల రమేష్, ఎజి కిషోర్, చిట్టేటి పెరుమాళ్లు, పాముూరు మునుస్వామి, దంతాల రవి, సురేష్‌నాయుడు, అంచల మధు, కె.శ్రీధర్, ఎల్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూశాఖకు మంచి పేరు తేవాలి



వెంకటగిరి, జూన్ 20 ప్రభాతవార్త : కార్యాలయానికి వచ్చే వారితో మర్యాదగా మెలిగి వారికి కావలసిన పనులు చేసే బాధ్యత సిబ్బందిపై ఉందని తాసిల్దార్ రాంబాబు తెలిపారు. వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా పలువురు సిబ్బందిని సన్మానించారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ అంటే ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడాలని తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్లో కన్నా రెవెన్యూ కీలకమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సుబ్బారావును సిబ్బందిని సన్మానించారు. ఆర్ఐ రాజేష్, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి సుబ్బారావు వీఆర్వోలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి కొత్తగా 1400 ఆర్టీసీ బస్సులు :ఈడి



వెంకటగిరి, జూన్ 20 ప్రభాతవార్త: రాష్ట్రానికి కొత్తగా 1400ఆర్టీసీ బస్సులు రానున్నట్లు కడప ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపోను కడప జోన్ డైరెక్టర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. సంస్థ కొత్తగా 1400 బస్సులను డిపోలకు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. డిపోల్లో ఇంకా బస్సుల కొరత ఉందదని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి సమస్త కు ఆదాయం తీసుకురావాలని సిబ్బందిని కోరారు. కార్మికులకు డిపోలో తగు వసతులు కల్పిస్తామని చెప్పారు. ఆయన మంత్ర డిపో మేనేజర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

వెంకటగిరి, జూన్ 20 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికు పిల్లలకు తల్లికి వందనం పథకం ఇవ్వాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుల్లూరు జాన్ తెలిపారు. వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా చేశారు. పారిశుద్ధ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తించకపోవడం దారుణమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి



బాలాయపల్లి, జూన్ 20 ప్రభాతవార్త: రెవెన్యూశాఖపై ప్రజల్లో మంచి నమ్మకం కలిగించాలని తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యాలయానికి పనులపై వచ్చే వారిని గౌరవంగా సమాధానం చెప్పాలని తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా సిబ్బంది విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తామని, విధులను సమర్ధవంతంగా నిర్వహించిన సర్వేయర్ తారక రామారావు వీఆర్వోలు, పలువురు సిబ్బందికి ప్రశంసా పత్రాలను తహశీల్దార్ అందజేశారు.

## తహశీల్దార్‌ను ఘనంగా సత్కరిస్తున్న నాయకులు



వాకాడు, జూన్ 20 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవ సందర్భంగా మండలటిడిపి పార్టీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, పాపా రెడ్డి పురుషోత్తంరెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కోట శ్రీనివాసులు, హరీష్ నాయుడులు తహశీల్దార్ రామయ్యను పూలమాలు వేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సత్కారంలో విజయ్ శేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో విజయ, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవిన్యూ వేడుకల్లో బహుమతులు అందజేత



వాకాడు, జూన్ 20 ప్రభాతవార్త : రెవెన్యూ దినోత్సవం కార్యక్రమంలో శుక్రవారం మండల తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో రెవిన్యూ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ సిబ్బంది, రెవిన్యూ అధికారులు, మండల సర్వేయర్లు వివిధ రకాల ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్లో మొదటి విజేతగా తహశీల్దార్ రామయ్య గ్రూపుకు మొదటి బహుమతి టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు ప్రతి ఒక్కరికి రెవెన్యూ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## స్వామిని దర్శించుకున్న జబర్దస్త్ నటులు

గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త: పట్టణంలోని రాజావీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని జబర్దస్త్ కామెడీ షో నటులు శాంతి కుమార్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శాంతి కుమారును ఘనంగా సన్మానించి వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అందరూ అకౌంట్ ఓపెన్ చేసుకొని ఎప్పటికప్పుడు ఆలయ విశేషాలను తెలుసుకోవాలని కోరారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త: గిరిజన యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు గిరిపుత్ర ఫౌండేషన్ అధ్యక్షులు జయవర్ధన్ తెలియజేశారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిపుత్ర ఫౌండేషన్ అధ్యక్షులు జవర్ధన్ మాట్లాడుతూ గిరిజన యువకుల్లో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ మెంబర్ మాకాని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రామ్మూర్తిలు పాల్గొన్నారు.

## 22న నేత్ర వైద్యశిబిరం

సూళ్లూరుపేట, జూన్ 20 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన దొరవారిసత్రంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి, తిరుపతి వారి సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కోగిలి జయరామిరెడ్డి సేవాసంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరుగుతుందని, శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## రెవెన్యూ శాఖను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలి



కోట, జూన్ 20 ప్రభాతవార్త: తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు ప్రజల మన్ననలు పొందుతూ విస్తృతమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖలతో పోలిస్తే రెవెన్యూ శాఖకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మనందరికి కూడా రోజువారీ ఒత్తిళ్లు ఉంటాయని, ప్రభుత్వానికి ప్రజలకు మనం ఒక వారధిలాగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు తహశీల్దార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## కోటలో కెనరా బ్యాంకు పునరుద్ధరణ



కోట, జూన్ 20 ప్రభాతవార్త: కోటలోని కెనరా బ్యాంకు ఆధునికీకరించి పునఃప్రారంభించారు. బ్యాంకును జనరల్ మేనేజర్ మిందయా, డిప్యూటీ జనరల్ మేనేజర్ రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా తమ బ్రాంచి ఖాతాదారులకు సేవలు అందిస్తోందని చెప్పారు. 210 కోట్ల వృద్ధిపథంలో 172 కోట్ల వ్యాపారాన్ని టర్నోవర్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ వంశీకృష్ణ, ఏఇఓ రహంతుల్లా, ఖాతాదారులు పాల్గొన్నారు.

## పదిరోజుల పాటు ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి క్యాంప్



కోట, జూన్ 20 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నావెల్, ఎన్‌సిసి 9వ వార్షిక శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు పదిరోజుల పాటు ఈ శిబిరం జరగనుంది. ఈ శిబిరానికి నెల్లూరు, తిరుపతి, కడప, గుంటూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి 600 మంది ఎన్‌సిసి క్యాడెట్లు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో పదిరోజులు పాటు నావెల్ కమ్యూనికేషన్, డ్రిల్, ఫైరింగ్, పెరేడ్, ఫార్మాలిటీస్, లీడర్‌షిప్, వ్యక్తిత్వ వికాసం, జాతీయ సమైక్యత, సామాజిక చైతన్య ర్యాలీలపై సమస్త అవగాహన కల్పిస్తారని లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఒడంగవే చెప్పారు. ఈ కళాశాలలో గత మూడేళ్లుగా తమకు శిక్షణ క్యాంప్‌కు అవకాశం కల్పిస్తున్న కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్లు మల్లికార్జునరెడ్డి, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



పెళ్లకూరు, జూన్ 20 ప్రభాతవార్త : మండలంలోని పెళ్లకూరు నందు తెదేపా సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు గారి నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సతీమణి నారా భువనేశ్వరి గారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆత్మీయ సమావేశంకు సుమారు 300 మంది కార్యకర్తలు నాయకులు పాల్గొని కేకులు కట్ చేసి స్వీట్స్ పంచి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు పేరం మధు నాయుడు చైతన్య కృష్ణారెడ్డి నాగేందర్ రెడ్డి శివయ్య కలవకూరు గోపాల్ రెడ్డి లోకేష్ నాయుడు రాకేష్ రెడ్డి జి రామకృష్ణ ఈ భాస్కరయ్య మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ వాహనాలతోనే పర్యావరణ పరిరక్షణ



నాయుడుపేట రూరల్,జూన్ 20 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట టీడీపీ నియోజకవర్గం ఇన్చార్జ్ నెలవల సుబ్రమణ్యం అన్నారు. నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి వద్ద క్యాపిటల్ మోటార్ ఎలక్ట్రికల్ బైక్స్‌ను నెలవల ప్రారంభించారు.పెట్రోల్ ధరలను దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలకు సరసమైన ధరలకు ఎలక్ట్రికల్ వాహనాలను అందించేసరించే సదుద్దేశంతో షో రూమ్ ప్రారంభించామని నిర్వాహకులు ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి మునిసిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఓజిలి, పెళ్లకూరు మండలాల టిడిపి అధ్యక్షులు విజయ్ విజయ్ కుమార్ నాయుడు, సంచి కిష్టయ్య, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, పలువురు ప్రజా ప్రతినిధులు ఎలక్ట్రికల్ వాహనాల షోరూం నిర్వాహకులు ఖలీల్‌కు అభినందనలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ వ్యవస్థ



గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త : ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు సేవలను అందిం చడంలో ముందుంటామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలియజేశారు. చిల్లకూరు మండల రెవెన్యూ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం తాసిల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన రెవిన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు సేవలను అందించడంలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, గూడూరు నియోజకవర్గం రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్రారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి, మండల సర్వేయర్ మల్లికార్జున్, ఆర్.ఐ పూర్ణ, వీఆర్వోల సంఘ అధ్యక్షులు గిద్దలూరు రమణయ్య, కార్యదర్శి భూతాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నూతన తహశీల్దార్‌గా ప్రసాద్



గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త : మండలం తాసిల్దారుగా ఆర్ వి ప్రసాద్ శుక్రవారం బాధితులు చేపట్టారు. కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్‌గా పనిచేస్తూ తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ప్రజలను ఎవరిని కార్యాలయం చుట్టూ తిప్పరాదన్నారు. ప్రజలకి అధికారులు సమన్వయంతో ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు.

## ఘనంగా రెవిన్యూ డే వేడుకలు

దొరవారి సత్రం, జూన్ 20 ప్రభాత వార్త: దొరవారిసత్రం మండలం పరిధిలోని తహశీల్దార్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన రెవిన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం మండల అధికారులు పాల్గొన్నారు రెవిన్యూ డే ప్రత్యేక నిధులు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు జవాబుదారీగా ప్రయోగవంతమైన పారిదర్శిక పాలన అందించడమే ప్రతి రెవిన్యూ ఉద్యోగి బాధ్యత అంటూ ఆర్ ఐ ప్రవీణ్ రాయలు వీఆర్వో జ్ఞానేంద్ర వినయ్ కుమార్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు

## అవినీతికి తావు లేకుండా పాలన

వెంకటగిరి, జూన్ 20 ప్రభాతవార్త : అవినీతి, అక్రమాలు లేని పరిపాలన అందించగలిగింది కేంద్రంలో ఒక్క భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని తిరుమల తిరుపతి దేవస్థానంలో బోర్డు సభ్యులు, బిజెపి అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఒక కళ్యాణ మండపంలో బిజెపి ప్రభుత్వం ఆవిర్భవించి 11 సంవత్సరాలు అయిన సందర్భంగా వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 సంవత్సరాల బిజెపి ప్రభుత్వ పాలనలో ఎలాంటి స్కాములు జరగలేదని తెలిపారు. పార్టీలో క్రమశిక్షణ పనిచేసిన వారికి కేంద్ర మంత్రులు, ఇతర పదవులు వస్తున్నట్లు తెలిపారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎస్.ఎస్.ఎన్ నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గురు ప్రసాద్, నాయకులు యోగేశ్వర నాయుడు, పాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి అనుమానాదాస్పద మృతి

వెంకటగిరి, జూన్ 20 ప్రభాతవార్త : పట్టణంలోని త్రిభువని డీలక్స్ కూడలిలో గుర్తుతెలియని 65 సంవత్సరాల వ్యక్తి అనుమానాదాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. వ్యక్తి మొఖం ఛాతిపై గాయాలయిండడంతో ఏ విధంగా మృతి చెంది ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం ఈ వ్యక్తి చనిపోయే ఉన్నట్లు స్థానికులు భావిస్తున్నారు. సిఐ ఏవి రమణ శవాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రిక తరలించారు.

## అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతి

చిల్లకూరు, జూన్ 20 ప్రభాతవార్త: చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తీపనూరు గ్రామ సమీపమున రైల్వే ట్రాక్‌కు దగ్గరగా ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతి చెందిఉన్నాడు. అతని వయసు సుమారు 50 సంవత్సరములు పైబడి ఉంటుంది. ఆ వ్యక్తి యొక్క వివరాలు తెలియడం లేదు. అందువల్ల సదరు వ్యక్తిని గుర్తించిన ఎడల వెంటనే చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐకి 94400796347కు గాని, రైటర్ ఫోన్ నెంబర్ 6302591915కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త : కొంతమంది సిబ్బంది చేసే పనుల వల్ల మొత్తం రెవిన్యూ వ్యవస్థ పై ప్రజల్లో అప నమ్మకం వస్తుందని కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని పనులు ఆలస్యం అవుతున్నాయని ప్రజలకు ఎప్పుడు రెవెన్యూశాఖ సేవలు అందిస్తుందని తహశీల్దార్ చంద్రశేఖర్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని మెప్మా భవనంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవిన్యూ డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు తాసిల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అన్ని ఆన్లైన్ వ్యవస్థ వచ్చిందని కొన్ని సాంకేతిక కారణాల వల్ల సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వలేకపోతున్నామని అయితే ప్రజలు తాసిల్దారు వీఆర్వోలు సక్రమంగా పనిచేయడం లేదని అనుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్, నాయకులు మట్టం శ్రావణి రెడ్డి, రాజు, పెంచలయ్య, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ తో విద్యుత్ ఆదా

గూడూరు, జూన్ 20 ప్రభాతవార్త : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని అలాగే బ్యాంకులోన్ మంజూరు చేయడం జరుగుతుందని సోలార్ కరెంటు వల్ల విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవచ్చని గూడూరు ఎలక్ట్రికల్ ఈఈ నరేందర్ రెడ్డి వెల్లడించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ గూడూరు డివిజన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పై విద్యుత్ వినియోగదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సోలార్ కంపెనీల ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## మెడికల్ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి



తిరుపతి హెల్త్, జూన్ 20 ప్రభాతవార్త : తిరుపతి రుయా ఆస్పత్రి, మెడికల్ కాలేజ్, మెటర్నటీ ఆస్పత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని వారి సమస్యల పరిష్కారంకు ఆర్డీవో వెంటనే స్పందించి న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి మాట్లాడారు. ఆర్డీవో వెంటనే స్పందించి సంబంధిత యాజమాన్యాన్ని పిలిపించి కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్.డి రవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఏఐటీయూసీ నగర ఆఫీస్ బేరర్ రైల్వే బాల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భానుప్రకాష్ పుట్టిన రోజు వేడుకలు



విజయపురం, జూన్ 20 ప్రభాతవార్త: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుట్టిన రోజు వేడుకలను మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అ భిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పన్నూరు, 4 రోడ్ల కూడలి, చురికాపురం, విజయపురం, కేశవపురంగ్రామాల్లో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధనంజయాదవ్, మాజీ ఎంపీపీ శివలింగం, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఉదయకుమార్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మహేంద్ర, నాయకులు గజేంద్ర నాయుడు, బాబు, లోకేష్‌రాజు, కొండూరు దామోధర్‌రాజు, ఏళుమలై, వరదరాజులు, సెల్వం, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కోలాహలంగా... కోలా జన్మదిన వేడుకలు










శ్రీకాళహస్తి,జూన్ 20 ప్రభాతవార్త : జన నాయకుడు,శ్రీకాళహస్తి ప్రజలకు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ కష్టమొచ్చినా, నష్టమొచ్చినా నేనున్నానని ఆదుకునే యువ నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి నుంచి పట్టణంలోని మారు మూల ప్రాంతాల్లో బాణా సంచాల శబ్దాలతో దద్దరిల్లింది. ఎటు చూసినా యువత సంబరాలు ఉదయం నుంచి ఆయన ఇంటి వద్ద జనం సందడి. వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా అతిథులు సన్మానాలతోముంచెత్తారు. శ్రీకాళహస్తి రాజకీయంగా కోలా ఆనంద్‌కుమార్ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా పరుగున వచ్చే ఆయన జన్మదిన సంబరాలను యువకులు, వ్యాపార సంఘాలు, వివిధ కుల సంఘాలు కదల వచ్చారు.

**పలువురి శుభాకాంక్షలు:**

శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చే యువకుడు కోలా ఆనంద్‌కుమార్ ఆయన జన్మదిన సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై ఆయనను సత్కరించారు. ఈ నేపథ్యంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి తిరుపతి కార్పొరేషన్ వైస్‌చైర్మెన్ ఆర్‌సి మునికృష్ణ జిల్లా పార్టీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

**పలుచోట్ల అన్నదానాలు,సంబరాలు:**

శ్రీకాళహస్తిని యోజకవర్గంలోని 130చోట్ల అన్నదానాలు, సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. సాయంత్రం తాను నివాసముంటున్న సంతమైదానంలోని నిరుపేదలకు అన్నదానం అలాగే మహిళలకు చీరలు కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై అందించారు. ఈ కార్యక్రమాలను రవిరాయల్ సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను బాలాజి, సుబ్రమణ్యం రెడ్డి, చందూ రాయల్ ఎక్కడా వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఘనంగా ఎమ్మెల్యే భానుప్రకాశ్ జన్మదిన వేడుకలు



పుత్తూరు, జూన్ 20 ప్రభాతవార్త : నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ జన్మదిన వేడుకలు పుత్తూరు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక కార్వేటినగరం రోడ్డు కూడలిలో కేక్ కట్ అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ఈ సందర్భంగా పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య మాట్లాడుతూ గత ఎన్నికల్లో 45 వేలకు పైగా మెజార్టీ సాధించి నగరి రాజకీయ చరిత్రను భానుప్రకాశ్ తిరగరాశారని తెలిపారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. అవినీతికి తావు లేని సమర్థ పాలన అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, రూరల్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బాలాజీ, వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులకు విద్యా సామగ్రిపంపిణీ

విజయపురం, జూన్ 20 ప్రభాతవార్త: మండలంలోని విజయపురం తమిళ మీడియం ఎంపీపీ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం టీడీపీ నాయకులు విద్యా సామగ్రిపంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్క ధనంజయ యాదవ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మాజీ మండల అధ్యక్షుడు దశరథరాజు, టీఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కపిల్, ఎస్సీసెల్ మాజీ ప్రధాన కార్యదర్శి వాసు, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## భాను జన్మదిన వేడుకలు



వడమాలపేట, జూన్ 20 ప్రభాతవార్త: నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలను శుక్రవారం సాయంత్రం వడమాలపేటలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాముయాదవ్, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, దేవానందనాయుడు, ఉదయ్, ధనంజయలునాయుడు, శివరాయల్, హేమావతి, లక్ష్మీప్రసన్న వెంకటయ్య, దేవా, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటేశ్వరరావు, బాబు సాహెబ్, రవిరెడ్డి, రాధాకృష్ణ, నాగరాజు, బత్తెయ్య, పెద్దబ్బరాజు, గురునాథం, బాబు, తులసిరామ్‌రెడ్డి, ఆదెయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్

సత్యవేడు, జూన్ 20 ప్రభాతవార్త: ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్,మేనేజింగ్‌డైరెక్టర్ శ్రీ సంతోష్‌రావు శ్రీసిటీని సందర్శించి పారిశ్రామిక వినియోగదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో విద్యుత్‌సరఫరా విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజీ హెచ్చు తగ్గులను నియంత్రించుటకు ఏపీఎస పీడీసీఎల్ ఏపీ ట్రాన్స్‌కో సిబ్బందికి శ్రీసిటీ పారిశ్రామిక వినియోగదారులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ కె.గురవయ్య, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ కృష్ణకుమార్, సీజీఎంవో అండ్‌ఎం వరకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు సురేంద్రనాయుడు, ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీరు కరుణాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పుత్తూరు దేవా ఆశీర్వాదం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీం, ఎంఆర్‌టీ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు(శ్రీసిటీ), జేఈ జగదీష్, ఎల్ఐ కార్తీక్, ఎల్ఎంపీసీ బాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక రైల్వే సమస్యను పరిష్కరించండి

పుత్తూరు రూరల్, జూన్ 20 ప్రభాతవార్త: దీర్ఘకాలిక రైల్వేసమస్యలను పరిష్కరించాలంటూ నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైసీపీ కమిటీ, అనుబంధ, కమిటీల నాయకులు డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం పుత్తూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన డీఎల్ఎంను కలసిన వారు దీర్ఘకాలికంగా ఉన్న సమస్య అయిన ఏకాంబరకుప్పం అండర్‌బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ నీలమేఘం, పుత్తూరు ఎంపీపీ మునివేలు, నగరి పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పుత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు అన్నా లోకనాథం, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, నగరి మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, నాయకులు బాలకృష్ణ, భూపాలన్, మురుగ, ఎల్లప్పరెడ్డి, ఆనంద్, సలీం, హమీద్, శశికుమార్‌లు పాల్గొన్నారు.